## క్లుప్తంగా

### లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై గంగన్న

**లింగాపూర్:** మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై గంగన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన ప్రతాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. బైక్‌పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి


వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

**లింగాపూర్:** విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని తహసీల్దార్ పెద్దిరాజు అన్నారు. గురువారం మండలలోని పిట్టగుడా ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని ఉపాధ్యాయులను అడిగారు.

### పరామర్శ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

**పెంచికల్‌పేట్:** మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన సిడాం చంద్రక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచులు ఉపాసీ సంజీవ్, పాలె సుధాకర్, నాయకులు చౌదరి తిరుపతి, సయ్యద్ సాజిద్, వెంకన్న ఉన్నారు.

### జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

**పెంచికల్‌పేట్:** జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిరంతరం కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని జర్నలిస్టులకు సభ్యత్వం అందచేశారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్‌ల కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, సంపత్‌కుమార్, నామ తిరుపతి, మిలిన్‌కుమార్ పాల్గొన్నారు.

### రేపు మార్కండేయ జయంతి

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఫిబ్రవరి 1న జిల్లా కేంద్రంలోని శివ భక్త మార్కండేయ ఆలయంలో నిర్వహించే మార్కండేయ జయంతి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని భక్త మార్కండేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, పద్మశాలీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

### నేడు ఎమ్మార్పీఎస్ సమావేశం

**రెబ్బెన:** మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల సమావేశం నిర్వహించనున్నట్లు నాయకులు గోగర్ల రాజేశ్, బొంగు నర్సింగరావు, రోడ్డ శంకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్‌రావు మాదిగ, జిల్లా అధ్యక్షుడు కొండ్ర భ్రమ్మయ్య హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండల కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

### జైనూర్‌లో ఉచిత వైద్యశిబిరం

**జైనూర్:** మండల కేంద్రలో ప్రతిమ వైద్య కళాశాల వైద్యులు, సిబ్బందితో డీఆర్‌డీవో దత్తారావు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అంతకు ముందు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం జంగో లింగో పీఠభూమి జంగాంలో ఎమ్మెల్యే దీక్ష విరమించారు.

# ప్రహరీ లేక పరేషాన్

- మందుబాబుల అడ్డాగా ప్రభుత్వ పాఠశాలలు
- ఆవరణలో పశువులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


ఐనంలో ప్రహరీ లేని ప్రాథమికోన్నత పాఠశాల


దహెగాం ప్రహరీ లేని ప్రాథమిక పాఠశాల

**దహెగాం:** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి మన ఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ లాంటివి ప్రవేశ పెడుతున్నా పూర్తిస్థాయిలో వసతులు కానరావడం లేదు. ప్రైవేటు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నా అవి అమలుకు నోచుకోవడం లేదు. మండలంలోని చాలాచోట్ల ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో పాఠశాలలు అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. పాఠశాల ఆవరణలో పశువులు వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

**మండలంలో 55 ప్రభుత్వ పాఠశాలలు**

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా మండల వ్యాప్తంగా 55 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం విద్యార్థులు 3,214 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సర్కారు బడుల్లో మరుగుదొడ్లు, ఆటస్థలాలు సైతం చాలా చోట్ల లేక వారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. 55 పాఠశాలలు ఉండగా అందులో కేవలం 13 పాఠశాలలకు మాత్రమే ప్రహరీలు ఉన్నాయి. ఇట్యాల, బొగుడగూడ, కేజీబీవీ, కొత్తపల్లిలోని పాఠశాలల్లో అసంపూర్తిగా ప్రహరీలు ఉన్నాయి. ఒక వైపు ఉండి మరో వైపు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 38 పాఠశాలలకు పూర్తిగా ప్రహరీ లేని కారణంగా మందుబాబులకు అడ్డాగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో సుమారు 210 మంది విద్యార్థినులు ఉండగా ఎదురుగుండా పీహెచ్‌సీ వైపు ప్రహరీ కూలి ఆరేళ్లవుతుంది. అయినా ఇప్పటివరకు ప్రహరీ నిర్మించలేదు. పలుమార్లు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా నిధులు మంజూరు కాలేదు.

**వరదలకు కూలిన ప్రహరీ**

2021–22లో భారీ వరదల కారణంగా ఐనం ప్రాథమికోన్నత పాఠశాలకు నీరు చేరడంతో ప్రహరీ కూలింది. మరుగుదొడ్లు సైతం పనిచేయడం లేదు. దీంతో ఒంటికి రెంటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వరదల వల్ల కూలిన ప్రహరీ స్థలంలో నెట్ (జాలీ) చుట్టూ ఏర్పాటు చేశారు. మళ్లీ వర్షాకాలంలో వరదలు రావడంతో అది సైతం కొట్టుకుపోయిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రహరీ నిర్మించేలా చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి**

మన ఊరు–మన బడి కింద ఎంపికైన పాఠశాలలకు ప్రహరీ నిర్మించాం. ప్రహరీ లేని పాఠశాలల విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటాను.

– శ్రీనివాస్, ఎంఈవో

## ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

**బెజ్జూర్:** మండలంలోని ఎలకపల్లి(బి), చిన్న సిద్దాపూర్ సమీపంలో గల ఎల్లారం పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరై భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఏటిగూడ, ఎలకపల్లి గ్రామాల్లో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. చిన్న సిద్దాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. నాయకులు పుల్లూరి సతీష్ కుమార్, కొండ్ర మనోహర్ గౌడ్, కొండ్రు శారద, సుధాకర్ గౌడ్, మహేశ్, రామకృష్ణ, సిలువ కనకయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

## పుష్కరఘాట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే


పుష్కరఘాట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని బాలేశ్వర స్వామి ఆలయం పెద్దవాగు సమీపంలో నర్మదా, సరస్వతి పుష్కరఘాట్‌లను స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, బీజేపి నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు మధుకర్‌శర్మ, నరేశ్‌శర్మల ఆధ్వర్యంలో గంగాపూజ నిర్వహించి హారతులిచ్చారు. పట్టణంలో ఉత్తరవాహిణి జీవనది ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఖాండ్రె విశాల్, రామారావ్, సురేశ్‌కుమార్, ధర్మపురి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, మాటూరి జయరాజ్, వెంకన్న, సాంగ్డె జీవన్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల తొలగింపు


అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న అధికారులు

**కాగజ్‌నగర్ రూరల్:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను గురువారం మున్సిపల్ అధికారులు తొలగించారు. పట్టణంలోని బస్టాండ్ వెనుకగల సర్వే నెం.143లో మున్సిపల్ నైట్‌షెల్టర్ కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్, రోడ్డును ఆక్రమించి చేపట్టిన షెడ్డును తొలగించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి యశ్వంత్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తక పఠన పోటీలు


పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**వాంకిడి:** మండలంలోని వాంకిడి, ఇందాని, బెండార, బంబార కాంప్లెక్స్‌ల పరిధిలో చదువుతున్న 4, 5వ తరగతి విద్యార్థులకు పుస్తక పఠన పోటీలు నిర్వహించారు. రూమ్ టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలకు అందించిన పుస్తకాలలోని అంశాలపై తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల వారీగా పఠన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఫిబ్రవరి 1న నిర్వహించే జిల్లా స్థాయి పఠన పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. వాంకిడి కాంప్లెక్స్ హెచ్‌ఎం నటరాజ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, రవి, సుశీల్, సచిన్, వినోద్, వినేష్, గౌరవ్, సీర్పీలు దుర్గం సందీప్, సునీల్ పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**రెబ్బెన:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించిన నేపథ్యంలో గురువారం గోలేటి టౌన్‌షిప్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ చేసిన 30ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో పాటు మాదిగ జాతి కోసం ఆయన చేసిన సేవలు, ఉద్యమాలు ఏ నాయకుడు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగంపెల్లి ప్రభాకర్, దుర్గం జనార్దన్, రాజేశ్, అనిల్, నవీన్, దశరత్, ప్రభాకర్, రాకేశ్, బాపు, శంకర్, దేవేందర్, వెంకన్న, రమేశ్, ధన్‌కుమార్ పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీకి ఘన నివాళి


వాంకిడి: మౌనం పాటిస్తున్న తహసీల్దార్, సిబ్బంది


నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

**దహెగాం:** మండల కేంద్రంలో ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టేకం సుధాకర్, రవీందర్, సత్తయ్య, బోరెం శంకర్, దామోదర్, అంజి, రాము, తిరుపతి పాల్గొన్నారు.

**బెజ్జూర్:** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు గురువారం మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన మార్గం యువత నడవాలన్నారు. కార్యక్రమంలో కుమ్మరి తిరుపతి, జాడి తిరుపతి, వసీఉల్లాఖాన్, గూడ రాకేశ్, మెస్రం రాజారాం, జాడి దిగంబర్, కొప్పుల దిలీప్ మహేశ్ పాల్గొన్నారు.

**వాంకిడి:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, డీటీ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

**రెబ్బెన:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తహసీల్దార్ రామ్మోహన్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, వ్యవసాయాధికారి దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


రెబ్బెన: మౌనం పాటిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్


నివాళులర్పిస్తున్న వాసవిక్లబ్ ప్రతినిధులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను కొనసాగిస్తామని వాసవి క్లబ్ అధ్యక్షుడు పాత శ్రీనివాస్ అన్నారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కృష్ణమూర్తి, కిషోర్, చిలువేరు వెంకన్న, గంధం శ్రీనివాస్, గుండా వెంకన్న పాల్గొన్నారు.

## హామీలను విస్మరించిన కాంగ్రెస్


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


రెబ్బెన: వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**రెబ్బెన:** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారం చేపట్టి 420 రోజులు గడుస్తున్నా.. రైతులకు, విద్యార్థులకు, నిరుద్యోగుల కు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. నాయకులు సంజీవ్‌కుమార్, మహేశ్‌గౌడ్, అహల్యాదేవి, శ్రీనివాస్, అశోక్, శంకరమ్మ, అరుణ, శ్రీధర్, ఆనంద్ పాల్గొన్నారు.

**వాంకిడి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ అజేయ్ కుమార్ ఆరోపించారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బండె తుకారాం, అశోక్ మహోల్కర్, వినోద్, కొండ రవి పాల్గొన్నారు.

**తిర్యాణి:** హామీల అమలు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైయిందని మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, ముత్యం రాజయ్య, బుర్ర రమేశ్ పాల్గొన్నారు.

**మహాత్ముడికి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేత**

**ఆసిఫాబాద్‌అర్బన్:** గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు చిలువేరు వెంకన్న, నిసార్, జీవన్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న సిబ్బంది

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్‌లో గల వసుపూజ్య జిన్నింగ్‌మిల్లులో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి కార్తీక్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నింగ్ మిల్లులోకి లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పత్తికి అంటుకున్నాయి. నిర్వాహకులు వెంటనే స్థానిక ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్‌తో ఘటనాస్థలికి చేరుకుని అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు అదుపు చేశారు. సుమారు రూ.50 వేల విలువైన పత్తి కాలిపోగా, రూ.5 లక్షల విలువైన పత్తిని కాపాడినట్లు అగ్నిమాపక అధికారి తెలిపారు. సిబ్బంది మహేశ్, ప్రవీణ్, శివకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### రంగుల 'అంగన్‌వాడీ'



పెంచికల్‌పేట్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం రంగు రంగుల బొమ్మలతో చిన్నారులను ఆకర్షిస్తోంది. ఇటీవల సాక్ష్యం కార్యక్రమంలో భాగంగా అధికారులు అంగన్‌వాడీ కేంద్రానికి రూ. 2 లక్షల 50వేల కేటాయించి మరమ్మతులు చేయించారు. అంగన్‌వాడీ లోపల, బయట బొమ్మలు వేయడంతో ఆహ్లాదకరంగా మారింది.

– పెంచికల్‌పేట్

### సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

**రెబ్బెన:** సమరయోధుల త్యా గాలను చిరకాలం స్మరించుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఆవరణలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. సమరయోధులకు నివాళులర్పించి రెండు నిమి షాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఏరియా ఇంజనీరు రామానాదం, డీజీఎం సెక్యూరిటీ ఉమాకాంత్, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి, రవికుమార్, మదీనాబాషా, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి**

**రెబ్బెన:** బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఆవరణలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, డీజీఎం సెక్యూరిటీ ఉమాకాంత్, అనిల్‌కుమార్, రవీందర్, రమేశ్, రాజాబాబు, శ్రీనివాస్, కిరణ్, కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

### ఆరోగ్యంపై కళాజాత


పాటలు పాడుతున్న కళాజాత బృందం సభ్యులు

**వాంకిడి:** మండలంలోని గోయేగాం, బంబార, చౌపన్‌గూడ గిరిజన గ్రామాల్లో గురువారం సాంస్కృతిక గిరిజన కళాజాత కళాకారులు ఆరోగ్యం, వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఎంవో వాసుదేవ్, హెచ్ఈవో రవిదాస్, ఎంఎల్‌హెచ్‌పీ రియాజ్, కళాజాత బృందం సభ్యులు మోహన్ నాయక్, పురుషోత్తం, సురేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.